## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**దువ్వూరు :** మండల పరిధిలోని పుల్లారెడ్డిపేటలో ఉన్న 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా మంగళవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వీరారెడ్డి సోమవారం తెలిపారు. ఈ విషయాన్ని రైతులు, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

### చిరుధాన్యాల పంటలకు వేపనూనె యూరియా

**పోరుమామిళ్ల :** మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో వేపనూనె కలిపిన యూరియా సమృద్ధిగా ఉందని మండల వ్యవసాయాధికారి వరహరికుమార్ తెలిపారు. ప్రస్తుతం 148 మెట్రిక్ టన్నుల యూరియా ఉందని రైతులు చిరుధాన్యాలు, నూనె గింజల సాగులో యూరియాను ఉపయోగించుకోవాలన్నారు. వ్యవసాయ పంటలకు దీని వలన ఉపయోగముందన్నారు. రైతులు ప్రైవేటు డీలర్ల వద్ద యూరియా కొన్నపుడు రైతులు బిల్లు తప్పక తీసుకోవాలన్నారు.

### నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

**ప్రొద్దుటూరు :** ప్రొద్దుటూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని మంగళవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, అధికారులు తప్పక సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

### డిప్యూటీ ఈఓ కార్యాలయం తనిఖీ

**ప్రొద్దుటూరు కల్చరల్ :** ప్రొద్దుటూరు డిప్యూటీ ఈఓ కార్యాలయంను కడప డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి సోమవారం తనిఖీ చేశారు. కార్యాలయ సిబ్బంది, పర్సనల్ రిజిస్టర్లు, అటెండెన్స్ రిజిస్టర్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల ఎస్ఆర్‌లను అప్‌డేట్ చేయాలని, వారి సమస్యలను త్వరగా పరిష్కరించడానికి కృషి చేయాలని సూచించారు.

### 'లిప్'తో నాణ్యమైన విద్య

**కాశినాయన :** అభ్యసనాభివృద్ధి కార్యక్రమం (లిప్)తో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించవచ్చని లిప్ జిల్లా పర్యవేక్షకులు కె.గంగయ్య తెలిపారు. సోమవారం రెడ్డికొట్టాల ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. లిప్ అమలు తీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా 6, 7, 8వ తరగతులకు లిప్ కార్యక్రమాన్ని అమలు చేస్తుందన్నారు. ప్రతి తరగతికి ప్రారంభ పరీక్ష నిర్వహించి గ్రేడ్‌లను రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. విద్యార్థులను గ్రూపులుగా విభజించి బోధన చేయాలని సూచించారు. ప్రతి నెల విద్యార్థుల సామర్థ్యాలు పెరిగే చూడాలన్నారు.

### ఉద్యోగాలకు ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థినులు

**ప్రొద్దుటూరు కల్చరల్ :** స్థానిక సాయిరాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు స్నావాసిస్ సాఫ్ట్‌వేర్ కంపెనీ వారు ఇటీవల నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో ఉద్యోగాలు సాధించారు. సీఎస్‌సీ ఫైనల్ ఇయర్ విద్యార్థిని విజయలక్ష్మి ఏడాదికి రూ.5లక్షలు, ఈసీఈ విద్యార్థిని హైమావతి ఏడాదికి రూ.4లక్షల వేతనంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరిని కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీరకళ్యాణ్ రెడ్డి, ప్రిన్సిపాల్ పాండుగనర్‌రవి, డీన్ రాజేంద్ర ప్రసాద్ అభినందించారు.

### టెన్నిస్ డబుల్స్ పోటీల్లో ప్రతిభ

**ప్రొద్దుటూరు కల్చరల్ :** ఆల్ ఇండియా సీనియర్ టెన్నిస్ అసోసియేషన్ (అయిస్టా) టెన్నిస్ డబుల్స్ పోటీల్లో రాయలసీమ వ్యాయామ కళాశాల అధ్యాపకుడు ఆకేపాటి శంకర్‌రెడ్డి ప్రతిభ కనపరచి విజేతగా నిలిచాడు. ఇటీవల శ్రీకాళహస్తిలోని విక్రమ్ టెన్నిస్ అకాడమిలో అయిస్టా ఆధ్వర్యంలో 55పైబడిన వయసు విభాగంలో జరిగిన పోటీల్లో శంకర్‌రెడ్డి కర్ణాటకకు చెందిన ఆర్ఎస్.రావత్‌తో కలిసి డబుల్స్ పోటీల్లో పాల్గొని ట్రోఫీని గెలుచుకున్నాడు. విజేతగా నిలిచిన ఆయనను ఆర్‌సీపీఈ ప్రిన్సిపాల్ రవిశంకర్, అధ్యాపకులు అభినందించారు.

### నోటు పుస్తకాలు పంపిణీ

**కాశినాయన :** మండలంలోని మిద్దెల హరిజనవాడ ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా సోమవారం ఆర్ట్‌ఆఫ్‌లివింగ్ యోగా టీచర్ బి.ఎస్.నారాయణరెడ్డి సోమవారం పాఠశాల విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్సిళ్ళు, కంబాక్సు, కాపీరైటింగ్ పుస్తకాలు, పలకలను అందజేశారు.

### రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ

**దువ్వూరు :** పుల్లారెడ్డిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు చరణ్, చెన్నకేశవ, కవిత రాష్ట్రస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో పతకాలు సాధించారని ప్రధానోపాధ్యాయురాలు అహల్యాబాయి తెలిపారు. భీమవరంలో ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు రాష్ట్రస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో చరణ్ అండర్–17 విభాగంలో వెండి పతకం, చెన్నకేశవ అండర్–14 విభాగంలో వెండి పతకం, బాలికల విభాగంలో కవిత కాంస్య పతకం సాధించారని హెచ్ఎం వివరించారు.

# సంక్షేమానికి అర్హతే ప్రామాణికం

**గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి**



సంక్షేమ బావుట బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

**ప్రొద్దుటూరు :** సంక్షేమ పథకాలకు అర్హతే ప్రామాణికమని.. ఎవరి సిఫారసు అవసరం లేదని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం కొత్తపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని అమృతానగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. గతంలో ప్రభుత్వ పథకాలు ఏవైనా రావాలంటే టీడీపీ నాయకుల రెకమెండేషన్ తప్పనిసరి చేశారన్నారు. అందుకు భిన్నంగా జగనన్న ప్రభుత్వంలో పథకాలు మంజూరవుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా రోడ్లు, డ్రైనేజి కాలువల నిర్మాణంతోపాటు వ్యక్తిగత సమస్యలపై ప్రజలు ఎమ్మెల్యేకు విన్నవించగా పరిష్కరిస్తామని తెలిపారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో మంజూరైన అమృతానగర్‌కు ఈ ప్రభుత్వం వచ్చాకే పెద్ద సంఖ్యలో రోడ్లు, కాలువలను నిర్మించామన్నారు. అనంతరం ఎమ్మెల్యే అమృతానగర్‌లోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. మన బడి నాడు–నేడు ద్వారా ఈ ప్రభుత్వం రూ.22 లక్షలు మంజూరు చేసిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి రాజారాంరెడ్డి, ఎంపీపీ శేఖర్ యాదవ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మార్తల ఓబుళరెడ్డి, కొనిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ డిష్ శ్రీను, వార్డు మెంబర్లు మోషా, లక్ష్మీనారాయణరెడ్డి, మాబుచాన్, సుమలత, స్వాతి, హనుమాన్‌రెడ్డి, తిరుపాల్‌రెడ్డి, ఎంపీటీసీలు గోపాల్ యాదవ్, అరుణకుమారి, తాటి లక్ష్మీదేవి, కౌన్సిలర్ కమాల్, నాయకులు శివారెడ్డి, బాషా, జంగమయ్య, బండారు సూరి, పంచాయతీ కార్యదర్శి గురుమోహన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భరత్‌రెడ్డి, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

**నేడు అమృతానగర్‌లో..**

మండలంలోని కొత్తపల్లె పంచాయతీ అమృతానగర్–2లో వైఎస్సార్ విగ్రహం వద్ద నుంచి మంగళవారం ఉదయం 7.30 గంటలకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభమవుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మార్తల ఓబుళరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పాల్గొంటారని, ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

## లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే గుర్తింపు రద్దు



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శాంతికళ

**ప్రొద్దుటూరు క్రైం :** లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే స్కానింగ్ సెంటర్ల గుర్తింపును రద్దు చేస్తామని డిప్యూటీ డీఎంహెచ్ఓ శాంతికళ తెలిపారు. జిల్లా ఆస్పత్రిలో సోమవారం గర్భధారణ, పూర్వ గర్భస్థ పిండ ప్రక్రియ చట్టంపై సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ అడ్వైజరీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. కమిటి చైర్మన్, డిప్యూటీ డీఎంహెచ్ఓ మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు పీసీ పీఎన్‌డీటీ చట్టాన్ని ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. ఈ చట్టాన్ని అతిక్రమిస్తే కఠినమైన శిక్షలు ఉన్నాయని తెలిపారు. డాక్టర్ గుర్తింపును పాక్షికంగా రద్దు చేయడంతో పాటు 3 ఏళ్ల జైలు శిక్ష, 10 వేల వరకు జరిమానా విధిస్తారన్నారు. రెండో సారి తప్పు చేస్తే 5 ఏళ్ల జైలు శిక్ష, 50 వేల వరకు జరిమానాతో డాక్టర్ గుర్తింపును పూర్తిగా రద్దు చేస్తారని పేర్కొన్నారు. స్కానింగ్ ఎఫ్ ఫారాలను పూర్తిగా నింపకపోయినా శిక్షలు నేరమేనని చెప్పారు. స్కానింగ్ సెంటర్‌కు రిజిస్ట్రేషన్ చేయకుంటే స్కానింగ్ మిషన్లను సీజ్ చేస్తామని తెలిపారు. సమాజంలో ఆడపిల్లైనా, మగపిల్లాడైనా సమానమే అనే భావనను అందరిలోనూ కల్పించాలన్నారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబు, గైనకాలజిస్టులు శ్రీవాణి, రేడియాలజిస్టు నాగరాజు, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, కమిటి సభ్యులు శ్రీదేవి, దేవదాసు, సూపర్‌వైజర్ జయమ్మ పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా ఎదగాలి



కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి

**ప్రొద్దుటూరు :** మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి తెలిపారు. నెహ్రూ యువ కేంద్రం, వికసిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక సూపర్ బజార్ రోడ్డులో ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్ శిక్షణను సోమవారం ఆప్కాబ్ చైర్‌పర్సన్ ప్రారంభించి మాట్లాడారు. ఉచిత కుట్టు శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. తద్వారా కుటుంబ ఆదాయాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి కె.మణికంఠ, వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మీదేవి, హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడు పామిడి వీరయ్య యాదవ్, శూలం శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం



ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

**బద్వేలు అర్బన్ :** త్వరలో జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పశ్చిమ రాయలసీమ నియోజకవర్గం నుండి పీఆర్‌టీయూ బలపరుస్తున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎం.వి.రామచంద్రారెడ్డిని గెలిపించాలని సోమవారం బద్వేలు, గోపవరం మండలాల్లోని వివిధ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు మిట్టాక్రిష్ణయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై మంచి అవగాహన కలిగిన ఎం.వి.రామచంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రామకృష్ణంరాజు, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటరమణ, రవిశంకర్, జిల్లా నాయకులు రవీంద్ర పాల్గొన్నారు.

## రైతులకు మెరుగైన సేవలు అందించండి



అరటి పంటను పరిశీలిస్తున్నయూనివర్సిటీ విస్తరణ సంచాలకులు కరుణశ్రీ తదితరులు

**మైదుకూరు :** వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా రైతులకు మెరుగైన సేవలను అందించాలని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ కరుణశ్రీ కేవీకే శాస్త్రవేత్తలకు సూచించారు. సోమవారం ఆమె కేవీకేను సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రం అధిపతి, శాస్త్రవేత్త శ్రీవిద్యారాణి, కేవీకే వార్షిక కార్యక్రమాల ప్రణాళికను విస్తరణ సంచాలకులకు వివరించారు. చేపట్టిన కార్యక్రమాల నివేదికను అందించారు. కేవీకేలో సాగు చేసిన వివిధ పంటలను పరిశీలించిన అనంతరం విస్తరణ సంచాలకులు కరుణశ్రీ మాట్లాడుతూ రైతులకు విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ గురించి శిక్షణ ఇవ్వాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న కేవీకే పరిపాలనా భవనాన్ని ఆమె పరిశీలించారు. సమీపంలోని ఆదిరెడ్డిపల్లె వద్ద రైతు వెంకటేశ్వర్లుకు చెందిన అరటి పంటను పరిశీలించారు.కేవీకే శాస్త్రవేత్తలు ఎం.హర్షిత, ఎస్.ఫిరోజ్ హుస్సేన్ పాల్గొన్నారు.

## పశువైద్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత



సంచార పశువైద్య శాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

**బద్వేలు :** రైతుల వ్యవసాయం, పశుపోషణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ పేర్కొన్నారు. సోమవారం పోరుమామిళ్లలో వారు వైఎస్సార్ సంచార పశువైద్యశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గానికి ఇప్పటికే ఒక సంచార పశువైద్యశాలను కేటాయించిన ప్రభుత్వం రెండో విడతలో మరోకటి అందజేసిందన్నారు. పశువులు అనారోగ్యం బారిన పడిన సమయంలో రైతులు టోల్‌ఫ్రీ నెంబరు 1962ను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆదిత్యారెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ రమణారెడ్డి, ఏడీ డాక్టర్ చంద్రశేఖర్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

### ఈకేవైసీ చేయించుకోవాలి

**చాపాడు :** అల్లాడుపల్లె రైతు సహకార సంఘం సొసైటీ బ్యాంకులో సభ్యత్వం కలిగిన రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని సీఈఓ జాన్ పేర్కొన్నారు. స్థానిక రైతు సహకార సంఘం బ్యాంకులో సోమవారం సీఈఓ మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా సొసైటీ బ్యాంకులను ఆన్‌లైన్ చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారన్నారు. ఇందులో భాగంగా రైతులు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. సభ్యత్వం కలిగిన రైతులు దరఖాస్తు ఫారం పూర్తి చేయాల్సి ఉందన్నారు. ప్రతి రైతుకు సంబంధించిన ఆధార్, రేషన్ కార్డు, డీసీసీబీ బ్యాంకు ఖాతా, పట్టాదారు పాసుపుస్తకం, జిరాక్స్ పత్రాలను అందజేయాలన్నారు. ఈ క్రమంలో రైతులు వెంటనే సొసైటీ బ్యాంకులో పత్రాలను అందజేసి ఈకేవైసీ పూర్తి చేయించుకోవాలని సీఈఓ తెలిపారు.

### నేడు, రేపు కానగూడూరులో గడప గడపకు మన ప్రభుత్వం

**దువ్వూరు :** మండల పరిధిలోని కానగూడూరు గ్రామంలో మంగళ, బుధవారాల్లో మధ్యాహ్నం 3 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పాల్గొంటారని, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

### పోస్టల్ లైఫ్ ఇన్సూ్యరెన్స్‌ను సద్వినియోగం చేసుకోండి

**ప్రొద్దుటూరు కల్చరల్ :** పోస్టల్ లైఫ్ ఇన్సూ్యరెన్స్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రొద్దుటూరు పోస్టల్ సూపరింటెండెంట్ కేపీ రవిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. పోస్టల్ లైఫ్ ఇన్సూ్యరెన్స్ పథకం 140వ సంవత్సరంలో అడుగు పెడుతున్న సందర్భంగా ఖాతాదారులకు, ఉద్యోగులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఫిబ్రవరి 1న ప్రొద్దుటూరు డివిజన్ పరిధిలోని అన్ని పోస్టాఫీసుల్లో ప్రత్యేక మేళాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు.

### ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

**బద్వేలు అర్బన్ :** ఫిబ్రవరి 13, 14వ తేదీల్లో ప్రొద్దుటూరులో జరగనున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా 18వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం ఏరియా కార్యదర్శి ఎం.అశోక్ పేర్కొన్నారు. స్థానిక సిద్దవటం రోడ్డులోని బీజేఎస్ఆర్ జూనియర్ కళాశాలలో సోమవారం మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ నాయకులు వర్ధన్, సంతోష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

### క్రీడా సామగ్రి వితరణ

**కలసపాడు :** మండలంలోని పెండ్లిమర్రి వద్ద ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలోని బాలికలకు సోమవారం వివేకానంద ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో క్రీడా సామగ్రిని వితరణ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విశ్రాంత ఉపాధ్యాయులు చెముడూరివీరాస్వామి మాట్లాడుతూ దేశానికి మంచిపేరు తీసుకువచ్చిన పి.టి.ఉష, పి.వి.సింధు లాంటి మహిళలను ఆదర్శంగా తీసుకుని క్రీడల్లో రాణించాలన్నారు. సంస్థ వ్యవస్థాపకులు పాపిజెన్నిరామకృష్ణారెడ్డి మాట్లాడుతూ నెహ్రూ యువ కేంద్రం యువ అధికారి మణికంఠ సహకారంతో క్యారంబోర్డు, వాలీబాల్, త్రోబాల్, షటిల్ వంటి వివిధ క్రీడా సామగ్రిని అందజేశామన్నారు. అనంతరం రామకృష్ణారెడ్డిని పాఠశాల సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి శిరిగిరిశివ, పాఠశాల ఇన్‌చార్జి ప్రీతి, ప్రభావతి, శైలజ, వీణ, కృష్ణవేణి, విజయవాణి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులు బాగా చదువుకోవాలి

**మైదుకూరు :** ప్రభుత్వం అందించే సౌకర్యాలను పొందుతూ విద్యార్థులు బాగా చదువుకోవాలని ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం మైదుకూరు మున్సిపాలిటీలోని శెట్టివారిపల్లె హైస్కూల్‌లో ఆయన విద్యార్థులకు విద్యా సామాగ్రిని అందజేశారు. విద్యార్థులకు విద్యాసామాగ్రితోపాటు సైన్స్ ఫెయిర్‌లో ద్వితీయ స్థానం పొందిన విద్యార్థులకు బహుమతులు అందజేసిన సైన్స్ ఉపాధ్యాయుడు రామసుబ్బన్నను ఉప విద్యాశాఖాధికారి అభినందించారు. కార్యక్రమంలో ఎంఈఓ పద్మలత, హెచ్ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు దుస్తుల పంపిణీ

**బి.కోడూరు :** మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలోని 224 మంది విద్యార్థినీలకు ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, చిత్తాతోమాస్‌రెడ్డిలు ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టుదలతో చదివినప్పుడే మనం అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలమని, దానికి ప్రయత్నం కూడా అవసరమని వారు తెలిపారు.

### యూరియా, ఎరువుల కొరత లేదు

**చాపాడు :** రైతులకు అవసరమైన యూరియా, ఇతర ఎరువులు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి మ్యాగి తెలిపారు. మండల కేంద్రమైన చాపాడులోని ఎరువుల దుకాణాలను సోమవారం మండల వ్యవసాయాధికారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతు భరోసా కేంద్రాల్లో కూడా ఎరువులు ఉన్నాయన్నారు. వీఏఏ గోపిరామ్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు

**ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ**



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే సుధ, ఎమ్మెల్సీ గోవిందరెడ్డి

**కాశినాయన :** అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని నరసాపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ఎస్సీకాలనీ, బీసీకాలనీ ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వారికి వివరించారు. ఆయా పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని తెలియజేశారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేసేందుకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ప్రభుత్వం నవరత్నాలుతో పాటు అనేక సంక్షేమ పథకాల ద్వారా పేదల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. ప్రతి ఇంటికి కనీసం రూ.లక్ష నుండి రూ.5 లక్షలకు పైగా లబ్ధి చేకూరిందన్నారు. సచివాలయాలు, వలంటరీ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే పథకాలను అందిస్తున్నామని వివరించారు. గడప గడపకు ప్రాధాన్యతనిస్తూ అత్యవసర పనులు చేపట్టేందుకు ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో గ్రామాల్లో అత్యవసర పనులను చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు ఆదిత్యరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ వైస్‌చైర్మన్ రమణారెడ్డి, నాయకులు హనుమంతరెడ్డి, కె.వెంకటరెడ్డి, రామసుబ్బారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, జమాల్, పీరావలి, జగన్‌మోహన్‌రెడ్డి, బాలనారాయణరెడ్డి, ఎంపీడీఓ ముజఫర్‌రహీమ్, తహసీల్దారు రామచంద్రుడు, వైద్యాధికారి డాక్టర్ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

## కుష్టు నివారణపై అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో సర్పంచ్, వైద్య సిబ్బంది

**ప్రొద్దుటూరు క్రైం :** మండలంలోని కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కామనూరు, చెన్నమరాజుపల్లె, గోపవరం పంచాయతీల్లో సర్పంచ్‌లు షేక్ షమీన్, ఆదిలక్షుమ్మ, మోషాలు ఆయా సచివాలయాల వద్ద సోమవారం కుష్టు వ్యాధిపై అవగాహన సదస్సులు నిర్వహించారు. వైద్యాధికారులు డాక్టర్లు హనీఫ్‌బాబా, శ్రీనివాసులు, ఏపీఎన్‌జీఓ అసోసియేషన్ తాలూకా అధ్యక్షుడు కేజే రఘురామిరెడ్డి, డీపీఎంఓ శ్రీను, సీహెచ్ఓ కృష్ణమ్మ, హెచ్ఈ శోభారాణి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

**బి.కోడూరు :** మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా సోమవారం మండల వైద్యాధికారులు డాక్టర్ వినీత్‌కుమార్, డాక్టర్ ఉదయ్‌కిరణ్ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని పది గ్రామ పంచాయతీల్లో జాతీయ కుష్టువ్యాధి నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యంగా డాక్టర్ వినీత్ కుమార్ ఆధ్వర్యంలో గోవిందాయపల్లె హైస్కూల్‌లో కార్యక్రమం ఏర్పాటు చేశారు. రామసముద్రంలోని అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, గ్రామస్థులకు డాక్టర్ ఉదయ్‌కిరణ్ కుష్టువ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించారు.

**బ్రహ్మంగారిమఠం :** కుష్టువ్యాధి నివారణపై సోమవారం నుంచి ఫిబ్రవరి 13 వరకు నిర్వహించనున్న అవగాహన సదస్సులో భాగంగా తోట్లపల్లెలో కార్యక్రమం నిర్వహించారు. పిహెచ్‌సి సిహెచ్ఓ సాంబశివారెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో స్పర్శలేని పొడలు లేక మచ్చలు ఉన్నట్లయితే వెంటనే వైద్యసిబ్బందికి తెలపాలన్నారు.

**చాపాడు :** జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన దినోత్సవం సోమవారం మండల కేంద్రమైన చాపాడు, మండలంలోని టీఓపల్లె గ్రామాలలో సోమవారం వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. మండల వైద్యాధికారి రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకూ ప్లెక్సీలతో కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేపట్టారు.

**బద్వేలు అర్బన్ :** కుష్టు రహిత సమాజం నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేద్దామని తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జోత్స్నస్వర్ణలత అన్నారు. కుష్టు నిర్మూలన దినోత్సవంలో భాగంగా సోమవారం మండల పరిధిలోని చింతలచెరువు పంచాయతీ బయనపల్లె విలేజ్ హెల్త్‌క్లినిక్‌లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ కుష్టువ్యాధి మైకోబ్యాక్టీరియంలెప్రె అనే సూక్ష్మక్రిమి ద్వారా సంక్రమిస్తుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ ఇన్‌చార్జి శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచ్ పద్మ, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, సీహెచ్ఓ భవాని, హెల్త్ అసిస్టెంట్ జనార్ధన్‌రావు, కౌన్సిలర్ చెన్నయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## చిరుధాన్యాలతో ఆరోగ్యం పదిలం



చిరుధాన్యాల సాగుపై మాట్లాడుతున్న నాగరాజ

**అట్లూరు :** చిరుధాన్యాల ఆహారంతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు మర్రిపాటి నాగరాజ పేర్కొన్నారు. మండల పరిధిలోని ఆర్బీకే పరిధిలో సోమవారం చిరుధాన్యాల సాగు, వినియోగంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు మండల వ్యవసాయాధికారి రామకృష్ణయ్య మాట్లాడుతూ చిరుధాన్యాలను ప్రోత్సహించడానికి భారతదేశం చొరవతో ఐక్యరాజ్యసమితి 2023 సంవత్సరాలు అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిందన్నారు. చిరుధాన్యాల ఆహారంతో రక్తపోటు, మలబద్ధకం, క్యాన్సర్ లాంటి వ్యాధుల నివారణకు దోహదపడతాయని తెలిపారు. సర్పంచ్ గంగమ్మ, తహసీల్దారు శ్రీవాణి, ఎంపీడీఓ సుజాతమ్మ, ఆర్బీకే వీఏఏ సందీప్‌కుమార్, రామ్మోహన్‌రెడ్డి, వెంకటసుధ పాల్గొన్నారు.

## ఘనంగా మహాత్మాగాంధీ వర్ధంతి



మైదుకూరు : గాంధీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఆర్యవైశ్యులు

**మైదుకూరు :** జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక అమ్మవారిశాలలో ఆర్యవైశ్యసభ ఆధ్వర్యంలో ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు సూరిశెట్టి శివ వెంకట ప్రసాద్ మాట్లాడుతూ త్వరలోనే మైదుకూరులో మహాత్మాగాంధీ, పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహాలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ నాయకులు యలవలి హరికిషన్, దొంతు వెంకటసుబ్బయ్య, దరిశా సునీల్, ఎలిశెట్టి ప్రసాద్, పెండేకంటి సంజీవ్, మిట్టా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

**దువ్వూరు :** దువ్వూరులోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం మహాత్మాగాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ చిత్రపటానికి ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఎంపీడీఓ జగదీశ్వరరెడ్డి, ఉపాధి హామీ సిబ్బంది, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**జాతిపితను స్మరించుకుందాం**

**పోరుమామిళ్ల :** జాతిపిత మహాత్మాగాంధీ అహింస మార్గాన్ని విశ్వసించిన ఆ మార్గంలో బ్రిటీష్ సామ్రాజ్యవాదుల నుంచి స్వాతంత్ర్యాన్ని సాధించారని హెచ్ఎం తుపాకుల శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం గాంధీ వర్ధంతి సందర్భంగా రామాయపల్లె ఎంపీపీ పాఠశాలలో గాంధీ చిత్రపటానికి విద్యార్థులు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ జాతిపితను మనం సదా స్మరించుకోవాలన్నారు.

## పోలీసు క్రీడాకారులకు ఏఎస్పీ అభినందన



మెమెంటో అందజేస్తున్న ఏఎస్పీ ప్రేరణాకుమార్

**ప్రొద్దుటూరు క్రైం :** ఇటీవల కడపలో జరిగిన జిల్లా పోలీసు స్పోర్ట్స్ మీట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన ప్రొద్దుటూరుకు చెందిన పోలీసు క్రీడాకారులను ఏఎస్పీ ప్రేరణాకుమార్ అభినందించారు. సోమవారం సాయంత్రం డీఎస్పీ కార్యాలయ ఆవరణంలో అభినందన సభను నిర్వహించారు. క్రీడాకారులకు సర్టిఫికెట్‌లను, పథకాలను ఏఎస్పీ అందచేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ క్రీడలు ప్రతి మనిషి జీవితంలో చాలా ముఖ్యమన్నారు. శారీరక, మానసిక ఉల్లాసం, ఆరోగ్యానికి దోహద పడతాయని తెలిపారు. విద్యార్థి దశ నుంచే తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహించాలని చెప్పారు. సీఐలు ఇబ్రహీం, యుగంధర్, ఎస్ఐలు హైమావతి, మంజునాథరెడ్డి, రెడ్డిసురేష్, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

## యూటీఎఫ్ నూతన కమిటీల ఎన్నిక



టి.శివప్రసాద్



క్రిస్టఫర్

**బద్వేలు అర్బన్ :** ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) బద్వేలు, గోపవరం మండలాల నూతన కమిటీని ఎన్నుకున్నారు. సోమవారం పట్టణంలోని వారి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో బద్వేలు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా టి.శివప్రసాద్, మహమ్మద్‌గౌస్, గౌరవాధ్యక్షులుగా మస్తాన్‌రెడ్డి, సహాధ్యక్షులుగా నరేష్, మంజుల, కోశాధికారిగా గురయ్యతో పాటు మరికొంత మంది కార్యదర్శులుగా, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికయ్యారు. అలాగే గోపవరం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా క్రిస్టఫర్, కంచిరెడ్డి, గౌరవాధ్యక్షులుగా వెంకటసుబ్బయ్య, సహాధ్యక్షులుగా తిరుపాల్‌రెడ్డి, సుధారాణి, కోశాధికారిగా రామచంద్రయ్యలు ఎన్నికయ్యారు. ఈ ఎన్నికకు ఎన్నికల పరిశీలకులుగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదనవిజయకుమార్, ఎన్నికల అధికారిగా యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు ఎస్.శశిధర్‌కుమార్‌లు వ్యవహరించారు.